

మిథిలా సామ్రాజ్యం తోటి రాజ్యాల పాలనా మరియు అన్ని రంగాలపరంగా ఎంతో కీర్తిని వైభవాన్ని సంతరించుకుంది.

రాజు విక్రమసేనుడి పరిపాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, జీవనం కొనసాగించేవారు. కానీ ఆ రాజ్యంలో కోశాధికారి ఎంపిక చాలా కష్టతరమైంది.



# కోశాధికారి

## మొరగాని రాంబాబు

అంతకుముందే కోశాధికారిగా పనిచేసి అందరి మన్ననలు పొందిన భూపతి అకస్మాత్తుగా మరణించడంతో ఎంపిక అనివార్యమైంది. అంతేకాకుండా రాజ్యం సర్వతోముఖాభివృద్ధికి, సస్యశ్యామలం కోసం రాజ్యంలో ప్రవహించే నదులకు ఆనకట్టలు ఒకేసారి నిర్మిస్తుండగా అతడు మరణించడం తీరని లోటయింది.

రాజు విక్రమసేనుని ఆహ్వానం మేరకు చాలామంది ఆ పదవి కోసం పోటీ పడ్డారు. కానీ పెట్టిన అన్ని పరీక్షలలో చివరికి సదానందుడు, దినకరుడు, గుణాఢ్యుడు ముగ్గురు మాత్రమే మిగిలారు. వారిలో ఎవరిని ఎంపిక చేయాలో కష్టమైంది. అప్పటికి ఎవరికి వారు సాటి అన్పించుకున్నారు.

చివరికి రాజగురువు దివ్యానందులవారిని సంప్రదించాడు. ఆయన ఇచ్చిన సలహా పాటించాడు.

విక్రమసేనుడు ఆ ముగ్గుర్ని సమావేశపరిచి తన ఆంతరంగికుడిని పిలిచి "నీ వెళ్ళి ఆ బంగారు నాణేలున్న రాశిలోంచి మూడు అండాలకు నింపుకుని వచ్చి వారి ముందు పెట్టుము" అని ఆజ్ఞాపించాడు. ఆ ఆంతరంగికుడు అలానే చేశాడు.

"మీ ముగ్గుర్కి మూడు ఆనకట్టల నిర్మాణపు బాధ్యతల్ని అప్పగిస్తున్నాను. ఈ ధనరాశుల్ని తీసుకెళ్లి మీ కప్పగించిన బాధ్యతల్ని, సక్రమంగా నిర్వహించగలరని ఆశిస్తున్నాము. వచ్చిన తర్వాత ఎంపిక నిర్ణయిస్తాము" అని చెప్పాడు.

ముగ్గురూ వెళ్లిపోయారు. నిర్మాణపు పనులు సజావుగా సాగుతున్నాయి.

కాలగమనంలో మరో మూడు మాసాలు గడిచిపోయాయి. నిర్మాణపు పనులు పూర్తయ్యాయి. ముగ్గురూ రాజధాని చేరుకున్నారు. సమావేశం ఏర్పాటయింది.

విక్రమసేనుడు సదానందుడ్ని ప్రశ్నించాడు బాధ్యతల గురించి! అందుకు "అయ్యా నాకప్పగించిన పనిని పూర్తి చేశాను. ఇచ్చిన ధనమంతా ఖర్చు అయిపోయింది." అని చెప్పాడు.

దినకరుడు కూడా "రాజా మీరిచ్చిన సొమ్ములో యింకా ఇది మిగిలింది" అంటూ పద్దులు చూపించాడు. మొదటి వాని కంటే నేను మేలు మిగుల్చుకొచ్చాను అని భావించాడు.

గుణాఢ్యుడు ముందుకొచ్చి "ప్రభు వుల వారు - మన్నించాలి ఆనక ట్టను సకాలంలో సమర్థవంతంగా నిర్వహణ చేపట్టాము. కాకపోతే కొంత ధనం మిగి లింది కానీ ఆ ధనాన్ని ఆనకట్ట నిర్మాణంలో ముంపుకు గురై నిర్వాసితులు అయిన గ్రామాల ప్రజలకు గృహాలు తదితర సౌకర్యాలకై వినియోగించడం జరిగింది. ఇది మీకు తెలియ చెప్పలేక పోయాను సమయాభావం వల్ల తప్పయితే క్షమించండి" అని చెప్పాడు.

రాజు విక్రమ సేనుడు ఆలోచించాడు - ముందే నిర్మాణ సమయంలో జరిగేదంతా గుఢాచారుల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు. మొదటివాడు కూలీల మెప్పుకోసం పని త్వరతగతికోసం అతిగా ఖర్చు చేశాడు. రెండోవాడు తన మెప్పు కోసం మిగుల్చుకొచ్చి వేతనాలు తక్కువిచ్చి శ్రమదోపిడి చేశాడు. మూడోవాడు తన పనులతో పాటు ప్రజల అవసరాలను గ్రహించాడు. నిజాయితీగా ప్రవ ర్తించాడు.

పాలకులు, అధికారులు ఉన్నది ప్రజలకోసమే కాబట్టి ముగ్గురిలో గుణాఢ్యుడే సమర్థుడుగా భావించి అతడిని కోశాధికారిగానే కాక సంక్షేమ మంత్రిగా కూడా పదవీ బాధ్యతల్ని అప్పగించాడు. ❁